

జ్యోతి ప్రజ్వలన చేసి నుమాయిష్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్




నుమాయిష్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఎగ్జిబిషన్ రైల్





# నయా సాల్.. చలో నుమాయిష్

- నగరానికి సరికొత్త గుర్తింపు.. ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్
- 83వ అఖిల భారత ప్రారిశ్రామిక ప్రదర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి
- హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్
- తొలి రోజే సందర్శకులతో కిక్కిరిసిన ప్రదర్శన
- పోలీసు యంత్రాంగంతో కట్టుదిట్టమైన భద్రత

సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ)/ తెలుగు యూనివర్సిటీ: నగరంలో ప్రతి యేటా నిర్వహిస్తున్న నుమాయిష్ హైదరాబాద్ మహానగరానికి ఎంతో ప్రాధాన్యత తెచ్చిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. 83వ అఖిల భారత ప్రారిశ్రామిక ప్రదర్శన కార్యక్రమానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సోమవారం సాయంత్రం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్-2024 ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం, సీఎం మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ అంటే చార్మినార్, ట్యాంక్‌బండ్ తర్వాత గుర్తొచ్చేది నుమాయిష్ అని పేర్కొన్నారు. ప్రతియేటా నుమాయిష్‌ను ప్రాధాన్యత తగ్గకుండా నిర్వహిస్తున్న సొసైటీకి అభినందనలు తెలిపారు. కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం తరపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. అట్లాగే సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాటితోపాటు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు. చారిత్రక నగరానికి గుర్తింపు తెచ్చిన నుమాయిష్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు అండగా ఉంటామన్నారు. ఎగ్జిబిషన్ నిర్వహణలో సమస్యలుంటే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని సొసైటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రధానంగా హస్తకళాకారుల నిపుణత, కళాకృతులు దేశాన్నే ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. తాను కూడా ఎగ్జిబిషన్‌కు వచ్చేవాడినని గుర్తు చేశారు.




## సందర్శకులకు అందుబాటులో 2400 స్టాల్స్..

కాగా, 1938లో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ప్రారంభమైన ఎగ్జిబిషన్ 1946లో ఎగ్జిబిషన్ మైదానంలోకి మారింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 26 ఎకరాల సువిశాల మైదానంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం, సందర్శకుల కోసం 2400 స్టాల్స్ అందుబాటులో ఉన్నాయని ఎగ్జిబిషన్ కార్యదర్శి బి.హన్మంతరావు తెలిపారు. విభిన్న సంస్కృతుల కళాకృతులు, దుస్తులు, ఆహార ఉత్పత్తులు నుమాయిష్‌లో కొలువుదీరాయి. ఫిబ్రవరి 15 వరకు 45 రోజుల పాటు నుమాయిష్ కొనసాగనున్నది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉత్పత్తులు ప్రజలకు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. సోమవారం సాయంత్రం నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి నుమాయిష్‌ను సందర్శించగా పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. విద్యుత్ దీపాల వెలుగులతో ప్రతి స్టాల్ సందర్శకులను ఆకర్షిస్తుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్కు, ఫుడ్ కోర్టులు, ట్రైన్ ప్రజలకు సరికొత్త అనుభూతిని పంచుతున్నాయి.

## కట్టుదిట్టమైన భద్రత

ప్రతి రోజు వేలాది మంది సందర్శించే నుమాయిష్‌కు పోలీస్ యంత్రాంగం భద్రత కట్టుదిట్టం చేసింది. ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లను నెలకొల్పడంతో పాటు ప్రతి వ్యక్తిని తనిఖీలు చేసిన అనంతరం, నిర్వాహకులు ప్రదర్శనకు అనుమతి ఇస్తున్నారు. మఫ్టీలో పోలీసులు నిఘాను పర్యవేక్షిస్తున్నారు. అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నారు.

## యావత్ తెలంగాణకు గర్వకారణం

- మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నుమాయిష్ యావత్ తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్నదన్నారు. ఎనిమిది దశాబ్దాలుగా ప్రదర్శనను నిర్వహిస్తున్న వారిని అభినందించారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఎగ్జిబిషన్.. దాదాపు 20కి పైగా విద్యా సంస్థలను ప్రారంభించారని, 30వేల మంది వరకు విద్యార్థులు చదువుతుండటం గొప్ప విషమని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకు నుమాయిష్ ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆణిముత్యంలా నుమాయిష్ యావత్ భారత్‌కే షాన్‌గా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్, కార్యదర్శి బి.హన్మంతరావు, కోశాధికారి రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు, మహేశ్ కుమార్ గౌడ్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన కొమురవెల్లి మల్లన్న ఆలయం

# 7న మల్లన్న కల్యాణం

### ఏర్పాట్లు చేస్తున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ అధికారులు



చేర్యాల, జనవరి 1: భక్తుల కొంగుబంగారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 7వ తేదీన (ఆదివారం) అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో ఆలయవర్గాలు స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికలను మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, దాతలు, అధికారులు, భక్తులకు అందజేస్తున్నారు. ఈ మహోత్సవాన్ని కనులారా చూసి తరలించాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి.

**వరుడు:** మల్లికార్జున స్వామి

**వధువులు:** మేడలాదేవి, కేతమ్మ దేవీ

**సుముహూర్తం:** స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర మాసం ఏకాదశి (07.01.2024 ఆదివారం), ఉదయం: 10-45 గంటలకు..

**కల్యాణ వేదిక:** కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలో ఉన్న తోటబావి

**కన్యాదాతలు:** మహాదేవుని వంశస్తులు

**స్వీకర్తలు:** పడిగన్నగారి వంశస్తులు

**వేద పర్యవేక్షణ:** 1008 వీరశైవ పీఠాధిపతి మణికంఠ శివాచార్యుల ఆధ్వర్యంలో

**పురోహితులు:** నడిపుడి మఠం భవానయ్య స్వామి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానేశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి,

**వ్యాఖ్యాతలు:** డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామిజీ

**ముఖ్య అతిథులు:** స్వామి వారి భక్తులు

**ఆహ్వానితులు:** ఆలయ కార్యనిర్వాహణాధికారి, వీరశైవ అర్చక, ఒగ్గు పూజారుల బృందం, ఆలయ సిబ్బంది.

## రెండు రోజుల పాటు పెండ్లి వేడుకలు

స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలను ఆలయవర్గాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 7న ఉదయం 5గంటలకు స్వామి వారికి దృష్టికుంభం (బలిహరణం), 10-45గంటలకు స్వామికల్యాణం, అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 7గంటలకు రథోత్సవం (బండ్లు తిరుగుట). 8వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అనంతరం మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



బిర్లా మందిర్‌లో భక్తజన సందోహం



బంజారాహిల్స్‌లోని పూరి జగన్నాథ ఆలయంలో..



జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ ఆలయంలో..

## ఆధ్యాత్మిక కేంద్రాలు కిటకిట..

నూతన సంవత్సరంలో ఆశలు, ఆశయాలు భగవంతునికి విన్నవించేందుకు భక్తులు ఆలయాలు, చర్చిలకు పోటెత్తారు. నగరంలోని పలు ఆధ్యాత్మిక కేంద్రాలైన గుడులు, గోపురాలు, చర్చిలు సోమవారం భక్తుల కోలాహలంతో కిక్కిరిసిపోయాయి. ప్రతి భక్తుడు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం భిన్నంగా, ఉన్నతంగా ఉండాలని, ఆర్థికంగా అంతా మంచే జరగాలని ఆయా దేవుళ్లను కోరుకున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలైన బిర్లా మందిర్, పెద్దమ్మ ఆలయం, గోల్కొండ జగదాంబిక ఆలయం, లాల్‌దర్వాజలోని సింహ వాహిని మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి, లష్కర్ ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు, సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ, తదితర చర్చిలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరం, మొదటి రోజు కావడంతో రానున్న రోజులు మంచిగా ఉండాలని భక్తులు ఆశలతో భగవంతుని సన్నిధికి చేరి వారి ఆకాంక్షలను ఏకరువు పెట్టుకున్నారు.



జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో..



సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ చర్చిలో..